గ్రంథాలయ సెస్ బకాయిలపై సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన గ్రంథాలయ సెస్ బకాయిలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను, పంచాయతీ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిలపై మున్సిపల్ కమిషనర్లతో జాయింట్ కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. గ్రంథాలయ సంస్థకు సెస్ రూపేణా రూ. 4,53,48,404 బకాయిలు జమ కావాల్సి ఉందన్నారు. దీనిలో గ్రామ పంచాయతీల నుండి రూ. 2,96,90768 బకాయిలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, పాల్గొన్నారు.

2026 డిసెంబరు నాటికి.. పునరావాసం పూర్తి చేస్తాం..

2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందిస్తాం.

నిర్వాసితుల ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు

పోలవరం నిర్వాసితులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్యాకేజీ అమలుకు కటాఫ్ తేదీ మార్చాలని నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

'పోలవరం ప్రాజెక్టు ఎపికి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు విడిచి పెట్టకముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తి చేస్తాం. ఆ తర్వాతే ప్రాజెక్టుకు నీళ్లు నింపి ప్రారంభిస్తాం.'____అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సిఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. గురువారం ఉదయం 11 గంటలకు రావాల్సిన సిఎం 12 :10 గంటలకు హెలీకాప్టర్లో పోలవరం చేరుకున్నారు. సిఎంకు పుష్పగుచ్ఛాలిచ్చి మంత్రులు రామానాయుడు, నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్‌ఎలు, ఇతర నాయకులు స్వాగతం పలికారు. కార్యకర్తల నుంచి వినతి పత్రాలను సిఎం స్వీకరించారు. అనంతరం వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పోలవరం ప్రాజెక్టు పనులపై అధికారులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

వినతులు స్వీకరిస్తున్న సిఎం

సమీక్షలో మాట్లాడుతున్న నిర్వాసితురాలు

నిర్వాసితులతో ముఖాముఖి..

సిఎం చంద్రబాబు తొలుత నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నిర్వాసితులు కుక్కునూరుకు చెందిన పరిటాల వరలక్ష్మి, రమాదేవి, కివ్వాక గ్రామానికి చెందిన మంత్రి గోపాలకృష్ణ, రంపచోడవరానికి చెందిన నిర్వాసితులు సిఎంతో మాట్లాడారు. పరిహారం జమపై ఆనందం వ్యక్తం చేస్తూనే 2017 కటాఫ్ తేదీ మార్చాలని, మిగులు భూములకు పరిహారం ఇవ్వాలని వంటి పలు సమస్యలను సిఎంకు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించామని తెలిపారు. 2019 తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఏనాడూ మీ గురించి పట్టించుకోలేదని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల ఖాతాల్లో రూ.828.25 కోట్లు జమచేశామని తెలిపారు. 2019లో తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందని, రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. 2026 డిసెంబర్ నాటికి పునరావాసాలు పూర్తి చేస్తామన్నారు. దళారుల అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారని విచారణ జరిపి అందరికీన్యాయం తీసుకుంటామని సిఎం తెలిపారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. పునరావాసం కల్పించిన తర్వాత మీ ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారని, ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు.

మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలన

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టులోని పలు విభాగాల్లో పనుల ప్రగతిని పరిశీలించారు. పనుల ప్రగతిని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఎస్ఇ రెడ్డి రామచంద్రరావు, తదితరులు సిఎంకు వివరించారు. అనంతరం అప్పర్ కాపర్‌డ్యామ్ చేరుకొని ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం గ్యాప్ - 1 పనులను పరిశీలించారు. అనంతరం వైబ్రో కంప్యాక్షన్ చేరుకొని పనులను పరిశీలించారు.

నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు వెనకాడం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు వెనుకాడబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎం ప్రాజెక్టు సమావేశం హాల్లో సమీక్షించి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను 2027 పుష్కరాలకు ముందే పూర్తిచేసి జాతికి అంకితం ఇచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఇందుకుగాను కాంట్రాక్టర్లు వారికి కేటాయించిన పనులను నిర్దేశించిన సమయానికంటే ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరుకు కాంట్రాక్టర్లకు నిర్దేశించిన పనుల్లో కొంతమంది కాంట్రాక్టర్లు వెనుకబడి ఉండడం, కొందరు సమావేశానికి హాజరు కాకపోవడంపై సిఎం స్పందిస్తూ పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహించొద్దన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 2025 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని, రైట్ మెయిన్ కెనాల్ కనెక్టవిటీలను జులై, 2026 నాటికి పూర్తిచేయాలని తెలిపారు. ఇసిఆర్ఎఫ్ -గ్యాప్ 1 పనులను 2026 మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. ఇసిఆర్ఎఫ్ -గ్యాప్-2 పనులను 2027 డిసెంబర్‌కు లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ గోదావరి పుష్కరాల కంటే ముందుగానే 2027 ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలన్నారు. అర్హులైన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాపికొండల నుంచి ధవళేశ్వరం వరకూ పర్యాటకంగా హోటళ్లు ఏర్పాటుచేయడం, పోలవరం ప్రాజెక్ట్ వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు, పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. సిఎం వెంట ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, పోలవరం ఎంఎల్ఎలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, ఏలూరు రేంజి ఐజి జివిజి అశోక్ కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివకిశోర్ ఉన్నారు.

నాటకీయ పరిణామాల మధ్య.. యలమంచిలి, అత్తిలి ఎంపిపి ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి - యలమంచిలి

'ఎంపిపి ఎన్నికల్లో మా అభ్యర్థికి మద్దతివ్వకుంటే మీ అంతు చూస్తామని వైసిపి నాయకులు మమ్మల్ని బెదిరిస్తున్నారని' ఎన్నికల అధికారికి టిడిపి సభ్యులు చేసిన ఫిర్యాదుతో గురువారం జరగాల్సిన యలమంచిలి ఎంపిపి ఎన్నిక నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి సభ్యుల నుంచి తమకు నాలుగు రోజుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని టిడిపి సభ్యులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో దీనిపై విచారణ చేయాల్సిందిగా పోలీసు వారిని ఆదేశించామని, లా అండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉండడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేస్తున్నామని తెలిపారు.

యలమంచిలి ఎంపిడిఒ కార్యాలయం నుండి బయటికి వెళ్తున్న వైసిపి సభ్యులు

మొత్తం మండల వ్యాప్తంగా 17 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా వారిలో 13 మంది వైసిపి సభ్యులు కాగా టిడిపికి నలుగురు సభ్యులు మాత్రమే ఉన్నారు. మామూలుగా అయితే ఎంపిపి పదవి వైసిపిని వరించే అవకాశం ఉంది. అయితే 13 మంది సభ్యులు ఉన్న వైసిపి నలుగురు సభ్యులు ఉన్న టిడిపిని బెదిరించాల్సిన అవసరం లేదని కావాలనే అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసి ఎన్నికలు వాయిదా వేయించారని, రాత్రికి రాత్రే కొంతమంది వైసిపి సభ్యులను లోబరుచుకుని అప్రజాస్వామికంగా ఎంపిపి పదవిని కైవసం చేసుకోవాలని టిడిపి నాయకులు కుట్రలు చేస్తున్నారని పలువురు వైసిపి సభ్యులు బహిరంగంగా మాట్లాడుకోవడం వినిపించింది.

గత కొన్ని రోజులుగా టిడిపి అగ్రనాయకుడికి టచ్‌లో ఉన్న మేడపాడు వైసిపి ఎంపిటిసి దేగల సూర్యప్రభ గురువారం ఎంపిపి ఎన్నిక వాయిదా పడిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే పాలకొల్లు ఎఎంసి మాజీ ఛైర్మన్ టిడిపి నేత గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు సారథ్యంలో టిడిపిలో చేరారు. ఆమెతో పాటు ఆమె భర్త వెంకటేశ్వరరావుకు టిడిపి నాయకులు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు అదేదారిలో మరి కొంతమంది వైసిపి ఎంపిటిసి సభ్యులు టిడిపి నాయకులకు టచ్‌లో ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతుండడంతో శుక్రవారం జరగాల్సిన ఎన్నిక ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందోననే ఉత్కంఠత నెలకొంది.

తణుకు : బైఠాయించిన కారుమూరి

తణుకు: అత్తిలి మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక గురువారం స్థానిక అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో జరగాల్సి ఉంది. అయితే టిడిపి కూటమి, వైసిపి మధ్య వాగ్వాదం జరిగింది. అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాసం నుంచి ఎంపిటిసిలతో వెళుండగా కారుమూరి నివాసం వద్దకు టిడిపి, కూటమి నాయకులు చేరుకుని వారిని అడ్డుకున్నారు. ఎంపిటిసిలు వెనుదిరిగి కారుమూరి నివాసంలోకి వెళ్లారు. బయట గేట్లు వేసి ఆయన నివాసం చుట్టూ టిడిపి, కూటమి నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని వారిని బయటకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. అత్తిలి మండలంలో మొత్తం 20 మంది ఎంపిటిసిలు ఉండగా ఇద్దరు టిడిపి, ఇద్దరు జనసేన సభ్యులు, 16 మంది వైసిపి సభ్యులు ఉన్నారు. వీరిలో ఒకరు విదేశాలకు వెళ్లారు. కారుమూరి వెంకటనాగేశ్వరరావు నివాసం ఎదుట ఉద్రిక్తత కొనసాగడంతో ఉదయం 9 గంటల నుంచి కారుమూరి ఎండలోనే బైఠాయించారు. సుమారు ఒంటి గంటకు అక్కడ ఉన్న టిడిపి, కూటమి నాయకులు నిష్క్రమణతో ఆయన నివాసంలోకి వెళ్లారు. సుమారు 3 గంటల పాటు ఎండలోనే కారుమూరి ఉన్నారు. ఈ సందర్భంగా కారుమూరి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ఖూనీ అయిన రోజు, ఇది ఒక బ్లాక్ డే, ఇప్పటి వరకూ చరిత్రలో జరగని విషయమని తెలిపారు. ఉదయం నుండి జిల్లా ఎస్‌పికి, డిఎస్‌పికి, సిఐకి ఎవరికి ఫోన్ చేసినా ఎక్కడ ఉన్నరో తెలియని పరిస్థితి అన్నారు. పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. తన నివాసం వద్ద దౌర్జన్యం జరుగుతుందని మాజీ మంత్రిగా, కౌన్సిల్ ఛైర్మెన్‌లు పోలీసు అధికారులకు ఫోన్ చేస్తే ఒక్క పోలీసు కూడా ఇక్కడికి రాలేదని విమర్శించారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాసం ఎదుట కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకుని, ఎంపిపి ఎన్నిక ఓటింగ్‌కి వెళ్తున్న 13 మంది ఎంపిటిసి సభ్యులను బయటకు రాకుండాఅడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో టివి కెమెరా మెన్ ఉద్రిక్త పరిస్థితిని చిత్రీకరిస్తున్న సందర్భంలో అక్కడ ఉన్నవారు కెమెరా మెన్‌పై దాడిచేశారు. స్వల్ప గాయాలయ్యాయి. కెమెరాను పాక్షికంగా ధ్వంసం చేశారు.

అత్తిలి మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నిక గురువారం నిర్వహించాల్సి ఉండగా నిర్ణీత సమాయానికి ఎంపిటిసి సభ్యులు ఎవ్వరూ హాజరు కానందున, కోరం లేనందున ఎన్నిక నిర్వహించబడలేదని రిటర్నింగ్ అధికారి కె మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిపి ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు ప్రకటించారు.

పలుచోట్ల ఉప సర్పంచుల ఎన్నిక ఏకగ్రీవం

పాలకోడేరు : నియామక పత్రాన్ని అందుకుంటున్న దిడ్ల విమల

ప్రజాశక్తి - పాలకోడేరు

గోరగనముడి ఉప సర్పంచిగా టిడిపి బలపరిచిన దిడ్ల విమల రవిను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉప సర్పంచిగా పనిచేసిన గూడూరి వెంకట ఆంజనేయులు వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేయడంతో ఉప సర్పంచి ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో స్థానిక సచివాలయంలో సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు(శివాజీ రాజు) అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశం అనంతరం ఉప సర్పంచి ఎన్నిక జరిగింది. 9 మంది వార్డు సభ్యులకు గాను ఒక వార్డు సభ్యుడు దిడ్ల కిషోర్ ఎన్నికకు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సర్పంచి శివాజీరాజుతో సహా మిగిలిన ఏడుగురు వార్డు సభ్యులు ఉప సర్పంచిగా దిడ్ల విమల రవిను ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఇఒపిఆర్‌డి రాంప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉప సర్పంచిగా ఎన్నికైన దిడ్ల విమలరవికు నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సరళ అందజేశారు. నూతన ఉప సర్పంచిగా ఎన్నికైన దిడ్ల విమలరవిను సర్పంచి శివాజీ రాజు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు, సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేసి, ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చెల్లబోయిన తాతారావు, వార్డు సభ్యులు దొంగ వెంకట సురేష్, రుద్రరాజు జానకీరామరాజు, సన్నిధి ధనలక్ష్మి, పెనుమాల నాగలక్ష్మి, పి.అనంతలక్ష్మి, జి.ఆంజనేయులు, నవీన్, విఆర్ఒ శ్రీనివాస్, ఇళ్ల పండు, పి.బాలకృష్ణ, జి.పెద్దిరాజు, దిడ్డ ప్రవీణ్‌కుమార్, చినపేట సంఘ పెద్దలు, గ్రామస్తులు అభినందించారు.

పాలకొల్లు రూరల్ : నియామక పత్రాన్ని అందుకుంటున్న రాంబాబు

పాలకొల్లు రూరల్ : మండలంలోని గోరింటాడ గ్రామ ఉప సర్పంచిగా టిడిపికి చెందిన పార్సి రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఉప సర్పంచి పదవికి ఉప ఎన్నిక నిర్వహించారు. గతంలో పంచాయతీ ఎన్నికల సమయంలో ఉప సర్పంచి పదవి రెండున్నర సంవత్సరాలు చొప్పున ఇరువురు చేయాలనే ఒప్పందంతో ఉప సర్పంచిగా పనిచేసిన అయ్యప్ప తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికను నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచి రాజబాబును మంత్రి రామానాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, గ్రామ సర్పంచి మండేల పావని, మండల త్రిమూర్తులు, పెరుమల్లు మన్మధరావు, మండేల వేణుగోపాలరావు, పెరుమల్లు రోహిణి రావు, మందపాటి నాగేశ్వరరావు, కండిబోయిన సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని ఉప సర్పంచిను అభినందించారు. మండలంలోని ఆగర్తిపాలెం గ్రామ ఉప సర్పంచిగా టిడిపికి చెందిన కడలి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, గ్రామ సర్పంచి కావలి లక్ష్మీకుమారి, మేడిది జాన్ రాజు, ఉంగరాల నరసింహారావు, నున్నబోయిన సత్యనారాయణ, మేడిది అదేల్ రాజు, రావూరి బాబురావు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని ఉప సర్పంచిను అభినందించారు.



నరసాపురం : నియామక పత్రాన్ని అందుకుంటున్న శేషు

నరసాపురం : మల్లవరం గ్రామ ఉప సర్పంచిగా 6వ వార్డు సభ్యుడు, జనసేనకు చెందిన పులఖండం ఆది విష్ణు శేషు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉప సర్పంచి ఎన్నికల అధికారి, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్ ఉప సర్పంచి ఎన్నిక పక్రియను నిర్వహించారు. వార్డు సభ్యులు ఏలూరి సతీశ్ బాబు పులఖండం ఆది విష్ణు శేషు పేరును ప్రతిపాదించారు. వార్డు సభ్యులు గోగులమండ ఇమ్మానియేలు, దంపబోయిన లక్ష్మి మర్గ, నౌడూరి సువార్త, బుంగ కమల బలపరిచారు. ఆదివిష్ణు ఒక్కరే పోటీలో ఉండటంతో ఆయన ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇఒపిఆర్‌డి నాగేంద్రకుమార్ ప్రకటించి ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేశారు. ఉప సర్పంచి ఎన్నిక పక్రియను డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఉప సర్పంచి ఎన్నిక సందర్భంగా నరసాపురం గ్రామీణ సిఐ జి.దుర్గా ప్రసాద్, గ్రామీణ ఎస్ఐ టివి.సురేశ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తణుకు : అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో టిడిపి అభ్యర్థి విజయకేతనం ఎగురవేశారు. గురువారం జరిగిన ఉపసర్పంచి ఎన్నికల్లో టిడిపి నుంచి ఉడతల నరేష్ విజయం సాధించారు. ఈ సందర్భంగా విజేత ఉడతల నరేష్‌ను తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు.



ఉండి : నియామక పత్రాన్ని అందుకుంటున్న సత్యనారాయణ

ఉండి : మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామపంచాయతీ ఉప సర్పంచిగా రెండవ వార్డు సభ్యులు ముగ్గళ్ల సత్యనారాయణను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి చల్లా వెంకట సుదర్శన్ రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఉపసర్పంచి ఎన్నికను పురస్కరించుకుని చల్లా వెంకట సుదర్శన్ రెడ్డి సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు దూసనపూడి రాంబాబు, ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చి రాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, పార్టీ మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల బాలరాజు, ఉండి యూనిట్ ఇన్‌ఛార్జులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, మజ్జి కృష్ణప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి జెవిటి నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఉప సర్పంచిగా ఎన్నికైన సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం సౌత్ ఉప సర్పంచిగా తిరుమల శివ గౌరిని గురువారం వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉప సర్పంచిగా పనిచేసిన పోతుల రమేష్ రాజీనామా చేయడంతో దీని నిమిత్తం ఎన్నికల అధికారి మేడిది నవీన్ కిరణ్ సర్పంచి తిరుమాని విజయలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సభ్యులు శివ గౌరిని ఏకగ్రీవంగా ఉప సర్పంచిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివ గౌరిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మేళం బన్ను, ఇన్‌ఛార్జి కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు ఉన్నారు.

భీమవరం టౌన్ : మండలంలోని 5 పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గతంలో ఉప సర్పంచిగా పనిచేసిన వారు పలు కారణాల వల్ల రాజీనామా చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మండలంలోని తుందుర్రు గ్రామ పంచాయతీ ఉపసర్పంచిగా గోగులమండ సుజన కుమారి, ఎల్‌విఎన్.పురం గ్రామ ఉపసర్పంచిగా రామాని కన్యాకుమారి, గూట్లపాడు ఉపసర్పంచిగా కొప్పర్తి సత్యనారాయణ, గొల్లవానితిప్ప ఉపసర్పంచిగా గరికిపాటి సురేష్(చిట్టిబాబు) బేతపూడి ఉపసర్పంచిగా బుంగ పండు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచిలకు ఐదు పంచాయతీల గ్రామ సర్పంచులు, వార్డు నెంబర్స్, గ్రామస్తులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా పలు మండలాలకు చెందిన యువ ఇఒపిఆర్‌డిలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.



భీమవరం టౌన్ : నియామక పత్రాన్ని అందుకుంటున్న సురేష్

పేదల ఇళ్లు కూల్చివేత అన్యాయం

బొండాడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లను అధికారులు కూల్చడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. గురువారం బొండాడ మెయిన్ రోడ్డులోని పేదల ఇళ్లు కూల్చిన ప్రదేశానికి గోపాలన్ వెళ్లి పరిశీలించారు. కొంతసేపు పేదలతో మాట్లాడారు. అనంతరం బొండాడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో బుల్డోజరు రాజకీయాలు పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనైక్యత విధానాన్ని మానుకోపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చి సంపన్నులకు భూమిని దోచిపెడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. మెయిన్ రోడ్డులో ఇళ్లు కూల్చిన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలిచ్చి తక్షణం మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతవరకూ నివాస ప్రాంతంలోనే ఉండేలా అనుమతివ్వాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచులను కోరారు. పేదలకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ పేదల ఇళ్లు కూల్చి ఉసురు పోసుకోవద్దని, పేదలు ఇళ్లు కోల్పోయి అద్దెలు కట్టుకోలేక, పిల్లలను చదివించుకోలేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజలు అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని, చూస్తూ ఊరుకోరని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొండాడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా

మా స్కూలు మాకు కావాలి

గొందిమూల వాసుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

మా పాఠశాల మాకు కావాలంటూ వేములదీవి(వెస్ట్) గొందిమూల వాసులు ఆందోళనకు దిగారు. ఇటీవల మండలంలోని ప్రాథమిక పాఠశాలను సమీపంలోని హైస్కూలులో విలీనం చేసే ఏర్పాట్లను విద్యాశాఖ ముందుకు తీసుకెళుతోంది. ఈ నేపథ్యంలో గొందిమూల వాసులు ఆందోళనకు దిగారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒ పుష్పరాజ్యం, ఎంపిడిఒ కృష్ణంరాజులకు మెమోరాండం సమర్పించారు. తమ స్కూలును తొలగించరాదని గ్రామస్థులు మొరపెట్టారు. ఎంఇఒ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎంఇఒ పుష్పరాజ్యం గొందిమూల వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో కూడా వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు పాల్గొని గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. గొందిమూల వాసులు కవురు తులసీ లక్ష్మి, తుమ్మా మాధవి, పోతుమేను దుర్గ, తుమ్మా లక్ష్మీ కాంతం, కవురు పద్మావతి, విద్యా కమిటీ ఛైర్మన్ కవురు రమేష్, పంచాయతీ సభ్యుడు తుమ్మా యువరాజు, గ్రామ పెద్దలు కవురు రామారావు, రామచంద్ర రావు, బొక్కా దుర్గరాజు పాల్గొన్నారు.



ఎంఇఒకి వినతిని అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

'పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి'

పెనుగొండ : గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామపంచాయతీ గౌరవాధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కార్మికులు పనిచేస్తున్నా ప్రభుత్వం టెండర్ పేరుతో కార్మికులకు సర్వీస్ లేకుండా చేస్తుందని విమర్శించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ పథకాల సంక్షేమం అమలు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ విధానం రద్దు చేయడం ద్వారా కార్మికుల హక్కులను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

మలేరియా అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం : పరిసరాల పరిశుభ్రత పాటించడ ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. గురువారం స్థానిక ఎన్‌టిఆర్ జంక్షన్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 9, 16 వార్డులలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటినిల్వలు లేకుండా చేసుకొని, వారానికొకసారి డ్రై డే పాటించినట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్ట వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శి దీపిక, వార్డు కార్యదర్శులు వెంకటలక్ష్మి, టి.చంద్ర, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం పట్టణంలోని 5వ వార్డులో సుమారు రూ.కోటి 2 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీలకు గురువారం ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యులు తోట సీతారామలక్ష్మి శంకుస్థాపనలు చేశారు. ముందుగా 34వ వార్డులో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్, 35వ వార్డు వంశీకృష్ణ నగర్లో రూ.29.02 లక్షలతో సీసీ డ్రెయిన్, 36వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, 37వ వార్డులో రూ.34 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్, 39వ వార్డు బైపాస్ రోడ్డులో రూ.10.10 లక్షలతో బీటీ రోడ్డుకు ఎంఎల్ఎ అంజిబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

ఆచంట : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో నిజాయితీగా విచారణ జరిపించాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్, రెవరెండ్ జి.తిమోతి రాజు, రాష్ట్ర సెక్రటరీ రెవరెండ్ డొక్కు డేవిడ్ రాజు డిమాండ్ చేశారు. గురువారం ఆచంటలో క్రీస్తు ప్రార్థనా మందిరంలో మండల పాస్టర్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు దైవజనులు అంతర్జాతీయ దైవజనులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పిడబ్ల్యుఎ కమిటీ సభ్యులు పి.శేఖర్ బాబు, అధ్యక్షులు ఐ.డేవిడ్ రాజు, కె.సువర్ణ రాజు, సెక్రటరీ పి.యేసురత్నం, ఎన్.తిమోతి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై వెంటనే సిబిఐ విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి మైనారిటీ వర్గాల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయని, ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని భీమారావు కోరారు. మతోన్మాదానికి తావులేకుండా చూడాలని మతసామరస్యం కాపాడాలని, లౌకిక ప్రజాస్వామ్యం కాపాడాలని కోనాల డిమాండ్ చేశారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు

పాలకొల్లు : మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ జన్మదిన వేడుకలు పాలకొల్లు పట్టణ చిరు, పవన్ యువత ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూలపల్లిలోని సివిఎన్ఆర్, ఎలిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు ఫ్రూట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. అనంతరం వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి యాతం రామలింగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర, చిరంజీవి యువత ఆచంట చరణ్ దీప్, రామాయణం మణికంఠ, సాధనాల దుర్గబాబు, బిట్రా లక్ష్మీనారాయణ, చేట్లోలు కృష్ణమోహన్ పాల్గొన్నారు. **ఆచంట** : జనసేన ఆధ్వర్యంలో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వల్లూరు గ్రామంలో మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు జవ్వాది బాలాజీ, వల్లూరు గ్రామ జనసేన అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి, జనసేన మండల ఉపాధ్యక్షులు తోట ఆదినారాయణ, సేవ మార్గం, సేవలక్ష్య ట్రస్ట్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ, ఆచంట మండల ప్రధానకార్యదర్శి నిమ్మన శేఖర్ పాల్గొన్నారు.

నరసాపురం : రామ్‌చరణ్ పుట్టినరోజు పురస్కరించుకుని నరసాపురం నియోజకవర్గ చిరంజీవి యువత ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వద్ద నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడు రామ్ చరణ్ అని తన నటనతో నిరూపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మారంశెట్టి కోటేశ్వరరావు, వలవల నాని, బ్లడ్ బ్యాంక్ సమన్వయకర్త ఎనుముల సతీష్, అభిమానులు కోపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సత్తిబాబు, బొయిడి శ్రీనివాస్, అడ్డాల బాబి, దాసరి కృష్ణా పాల్గొన్నారు. **కాళ్ల** : కాళ్ల గ్రామంలో మెగా హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిమ్ అనిల్, సాయితరుణ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కాళ్ల పిహెచ్‌సి డాక్టర్ సునీల్ శిబిరాన్ని ప్రారంభించారు. జనసేన నాయకులు ఎరుబండి రామాంజనేయులు, పుప్పాల బుజ్జి, బండారు సోమేశ్వరరావు, రాజేశ్, జగన్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : సిపిఐ

భీమవరం : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పాలూరిపేటలో ఆకులు చెరువు వద్ద ఇళ్లు లేని పేదలతో ఇంటి స్థలాల కోసం సిపిఐ నాయకులు గురువారం పూరి గుడిసెలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ లేనిపోని హామీలు ఒప్పించి అధికారం చేపట్టిన ప్రభుత్వం హామీలను విస్మరించిందన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలతో జిల్లా ప్రజానీకం సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజాప్రతినిధులు సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, మహిళా నాయకులు సానబోయిన దేవి, షేక్ రీమా, మహ్మద్ సోనియా, అబ్దుల్ గౌసియా బేగం, రుబ్బల సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

'నవోదయం 2.0'పై అవగాహన

తాడేపల్లిగూడెం : నాటుసారా నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఎస్.కొండేపాడు గ్రామంలో ఎక్సైజ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై ఇ.సూరాబ్బులు, ఎస్ కొండేపాడు గ్రామ సర్పంచి సీతాలం వీరలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారాయి సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలు, అనారోగ్యాలు వివరించి ప్రజలందరూ నాటుసారా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిని వినియోగించకూడదని తెలిపారు. ఈ సందర్భంగా నవోదయం 2.0 కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వ ఆశయాలను అనుసరించి గ్రామంలో సారా అమ్మకాలు, తయారీ, సేవించడం చేయకూడదని తీర్మానించారు. విఆర్‌ఒ అడబాల రామకృష్ణ ప్రసాద్, మహిళా పోలీస్ శివరాణి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటయోధుడు గంగిశెట్టి

వీరవాసరం : అలుపెరగని పోరాట యోధుడు కడలి గంగిశెట్టి, ఆయనను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ సిపిఐ నాయకుడు కడలి గంగిశెట్టి ద్వితీయ వర్ధంతిని గురువారం మండలంలోని నవుడూరు గ్రామ మృత్యుంజయ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన నెక్కంటి జెండా ఆవిష్కరణ చేసి అనంతరం మాట్లాడుతూ తొలితరం సిపిఐ నాయకుడు, భూసామ్య వ్యతిరేక, వల నిర్మూలన పోరాటాలలో పోలిశెట్టి బాసటగా నిలిచిన నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి.ఆనంద్ అధ్యక్షత వహించగా, మండల ఎంపిపి వీరవల్లి దుర్గా భవాని జ్యోతి ప్రజ్వలన చేశారు. సిపిఎం నాయకులు నరసింహమూర్తి, సత్యనారాయణ, ఎంఎల్ఎ నారాయణమూర్తి, వీరవల్లి రామకృష్ణ, మండల కార్యదర్శి ఎం.లక్ష్మీపతి, మండల మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, గీత కార్మిక సంఘం నాయకులు నరసింహమూర్తి, వీరవాసరం మాజీ సర్పంచి వీరవల్లి రామకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసు, నామాల సర్పంచి నల్లమిల్లి శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సోమసుందర్‌కు డాక్టరేట్

భీమవరం టౌన్ : మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అవంత్స వెంకట సోమసుందర్‌కు కెఎల్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ ప్రధానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరపున వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వి.రంగరాజు డాక్టర్ ఎవి సోమసుందర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమసుందర్ మాట్లాడుతూ కెఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఏడుకొండలు పర్యవేక్షణలో 'అలగారిథమ్ డెవలప్మెంట్ ఫర్ రోబోటిక్ పాత్ ప్లానింగ్ అండ్ మోషన్ సిములేషన్ ఇన్ ఆటోమేటిక్ వెల్డింగ్' అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎక్కువ మంది పిహెచ్‌డిలు పూర్తిచేశారని ఫలితంగా విద్యార్థులకు మంచి విద్య అందించగలుగుతున్నారని పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన ఎవి సోమసుందర్‌ను అభినందించారు.

బెన్ని బాబుకు అభినందన

నరసాపురం : సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (ఆటానమస్)లో బిటెక్ ఫైనల్ ఇయర్ ఇసిఇ బ్రాంచ్‌కు చెందిన గెడ్డం బెన్నీ బాబు ఇటీవలి తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ లెవల్‌లో నిర్వహించబడిన టెక్ ఇఫోరియా పోటీలో క్లిక్ అండ్ ఫ్లిక్, కాప్చర్ ది ఇఫోరియా అనే విభాగాలలో పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడిన 35 ఫోటోగ్రఫీ అవార్డుల్లో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంలో విజేత గెడ్డం బెన్నీబాబును కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపిచంద్, ఇసిఇ విభాగాధిపతి బి.సుబ్రహ్మణ్యేశ్వర రావు అభినందనలు తెలియజేశారు.

రేషన్ కార్డులకు ఇకెవైసి చేయించుకోవాలి

తాడేపల్లిగూడెం : మండలంలోని రేషన్ కార్డులకు సంబంధించి ఇకెవైసి అప్డేట్ చేసుకోవాలని తాడేపల్లిగూడెం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన లిస్టులు అన్ని రేషన్ డీలర్ల వద్ద పొందుపరిచినట్లు తెలిపారు. కావున రేషన్ కార్డుదారులు గమనించి మీ సంబంధిత రేషన్ షాప్ డీలర్ల వద్ద ఈనెల మార్చి 31వ తేదీ లోపు ఇకెవైసి అప్డేట్ చేసుకోవలసిందిగా తహశీల్దార్ ప్రకటనలో తెలియజేశారు.

కుక్కలకు వ్యాక్సిన్ వేస్తాం : డాక్టర్ హేమ

ఉండి : పంచాయతీ అధికారుల సమన్వయంతో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ అందించగలమని వెటర్నరీ డాక్టర్ తమ్మిశెట్టి హేమ అన్నారు. 'వీధి కుక్కలకు వింత వ్యాధి' అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురించిన నేపథ్యంలో డాక్టర్ హేమ ప్రజాశక్తితో మాట్లాడుతూ పెంపుడు కుక్కలను యజమానులు నిరంతరం పర్యవేక్షించుకుంటారని కానీ వీధి కుక్కలు పరిశుభ్రత లేకపోవడంతో చర్మవ్యాధులు అధికంగా ఉంటాయని, దీనివల్లనే ఇటీవల చాలా కుక్కలు రోగాల బారిన పడ్డాయని తెలిపారు. వాటికి వారానికి ఒకసారి మందులు వేసి రోగాల నుంచి కాపాడవచ్చు అని కానీ వాటిని పట్టుకోవడానికి పంచాయతీ అధికారులు సహకారం అందించాలన్నారు. ఇదే విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లామని వారు వివరించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సందర్శన

మొగల్తూరు : ఈ ఆర్థిక సంవత్సరంలో రిజిస్టర్ కార్యాలయాల ద్వారా 600 కోట్లు రాగా ఫిబ్రవరి నాటికి 60 శాతం పైబడి ఆదాయం సమకూరిందని జిల్లా రిజిస్టర్ లంక వెంకటేశ్వర్లు తెలిపారు. మొగల్తూరులోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీల్లో ప్రభుత్వం సెలవు దినాలైనా తమ కార్యాలయాలు పనిచేస్తాయని కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మొగల్తూరు సబ్ రిజిస్టర్ ఎస్.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

రంగస్థల కళాకారులను ఆదుకోవాలి

సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి అప్పారావు

మొగల్తూరు : రంగస్థలం కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి అప్పారావు కోరారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఆధ్వర్యంలో రంగస్థలం కళాకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రంగస్థలం నాటకాలకు ఆదరణ కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులను ఆదుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాలలో ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు, కళాకారులు సంకరపు వెంకటేశ్వర్లు, పినిశెట్టి మల్లికార్జున రావు, తోట వెంకటేశ్వరరావు, తిరుమాని భాస్కరరావు, అందే జగన్నాథం, కొక్కిరిగడ్డ వేమన్నా, మోకా ఏడుకొండలు, తిరుమాని మల్లికార్జునరావు, ఏడుకొండలు ఉన్నారు.

గుర్రపు డెక్కతో కంపోస్ట్ తయారీ

ఆకివీడు : గుర్రపు డెక్కతో కంపోస్ట్ తయారీతో రైతులు అధిక లాభాలను పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వర్లు సూచించారు. ఈమేరకు జిల్లాలోని కొన్ని ప్రత్యేక కేంద్రాలను ఎంపిక చేసి ఆ కేంద్రాలలో ప్రయోగాత్మకంగా పరిశీలన ప్రారంభిస్తున్నామని చెప్పారు. గురువారం సాయంకాలం మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని పంచాయతీ చెత్తతో ఎరువు తయారీ కేంద్రాల్లో గుర్రపు డెక్క కంపోస్టు తయారీకి ఉన్న అవకాశాలను పరిశీలించి మాట్లాడుతూ కంపోస్ట్ తయారీ విధానాన్ని వివరించారు. సిద్ధాపురం గ్రామంలో కంపోస్ట్‌ను తయారు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

జిల్లా సర్వేయర్ జాషువా

తాడేపల్లిగూడెం : రీ సర్వే వల్ల భూ సమస్యల శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా సర్వేయర్ జాషువా పేర్కొన్నారు. మండలంలోని కృష్ణయ్యపాలెంలో భూముల రీసర్వే కార్యక్రమ ప్రారంభోత్సవ సదస్సు గురువారం సర్పంచి బేతపూడి వెంకటసుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన భూముల రీ సర్వే కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే నవాబుపాలెంలో రీ సర్వే చేపట్టి విజయవంతంగా ముగించామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉన్న తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. రీ సర్వే చేసే ప్రాంతాల వివరాలు రైతులకు ముందస్తుగానే సమాచారం ఇస్తామని అందరూ సహకరించాలని కోరారు. గ్రామ ఉపసర్పంచి బేతపూడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చక్రవర్తి, డిప్యూటీ తహశీల్దార్ కలి కృష్ణ, విఆర్‌ఒ రాంబాబు, కార్యదర్శి హరికిషోర్ పాల్గొన్నారు.

నాణ్యమైన వస్త్రాలకు కేరాఫ్ మినిస్టర్ వైట్

భీమవరంలో షోరూంను ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : సాంప్రదాయ, నాణ్యమైన స్వదేశీ వస్త్రాలకు కేరాఫ్ మినిస్టర్ వైట్ అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం పిపి రోడ్‌లో మినిస్టర్ వైట్ షోరూంను గురువారం ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. సరసమైన ధరల్లో నాణ్యమైన ధోతీలు, షర్టులు ఒకేచోట లభించడం సంతోషదాయకమన్నారు. మినిస్టర్ వైట్ కంపెనీ సిఇఒ సురేష్ రామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారతదేశం వ్యాప్తంగా 40 షోరూంలున్నాయి, ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి, తణుకు, కాకినాడ, విజయనగరం, పలాసలతోపాటు భీమవరంలో 6వ షోరూమ్ ప్రారంభించామని, త్వరలో తెలంగాణలో రెండు షోరూంలను ప్రారంభిస్తామన్నారు. తెల్ల షర్టులు, కలర్ షర్టులు సిల్క్, లెనిన్ షర్టులు మా ప్రత్యేకత అని, ఒకటో సంవత్సరం పిల్లల దగ్గర నుంచి 16వ సంవత్సరం పిల్లల వరకు అన్ని రకాల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆశిష్, కిషోర్, ఆంధ్ర ఏరియా సేల్స్ మేనేజర్ జహీరుద్దీన్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కిరణ్, లంకి చిన్ని పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు విద్యార్థులు శ్రీకారం చుట్టాలి

ట్రివర్జిన్స్ టెక్నో ఇన్నోవేషన్ సిఇఒ డాక్టర్ రోజా

తాడేపల్లిగూడెం : విద్యార్థులు సృజనశీల వ్యాపార ఆలోచనలకు ఆకృతినిస్తే అంకుర పరిశ్రమలు ఊపిరిపోసుకుంటాయని ట్రివర్జిన్స్ టెక్నో ఇన్నోవేషన్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ(చెన్నై) సిఇఒ డాక్టర్ వడ్లమూడి రోజా సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో స్టార్టప్ ఐడియా ఎక్స్ పో(జెనిసిస్ 2025) కార్యక్రమాన్ని డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రోజా మాట్లాడుతూ భారతదేశం రూపురేఖలు మార్చే శక్తి యువతకే సొంతమని తెలిపారు. విద్యార్థులు తమలోని శక్తి, సామర్థ్యాలను వెలికితీసి కాలానికి తగిన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే ఉన్నత శిఖరాలకు సులువుగా చేరుకోవచ్చన్నారు. వినూత్న ఆలోచనలు విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలని, అవి వారి వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దేలా ఉండాలని వివరించారు. డీన్‌లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్ మాట్లాడుతూ దేశాన్ని పురోగతి దిశగా ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత యువతరానిదేనని తెలిపారు. అనంతరం రోజాను ఆచార్యులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి గేట్ పరీక్షా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పలువురు ర్యాంకర్లను అభినందించారు. **ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్ పో** : ఎపి నిట్ విద్యార్థులతోపాటు కెఎల్ యూనివర్సిటీ, పివిపి సిద్ధార్థ కళాశాల, శ్రీనివాసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల, లెండి ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాల, సిఆర్ రెడ్డి, స్వర్ణాంధ్ర, విష్ణు, శశి ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు మొత్తం 96 ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాజెక్టులను ఆచార్యులు పరిశీలించి, వాటిలో అద్భుత ప్రతిభ కనబరిచిన మూడు ప్రాజెక్టులను ఎంపికచేసి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ టి.కిరణ్, డాక్టర్ ఫణికృష్ణ, డాక్టర్ విఎల్ఎన్.శాస్త్రి, డాక్టర్ పిఎస్‌వి.కిషోర్, డాక్టర్ రాజేష్, డాక్టర్ ఎస్.కోడీశ్వరన్ పాల్గొన్నారు.

మడుగు పోలవరంలంకలో సమస్యలపై ఏకరువు

వీరవాసరం : మండలానికి దూరంగా ఉన్న మడుగుపోలవరం లంక గ్రామం పట్ల చిన్నచూపు చూస్తున్నారంటూ గ్రామస్తులు, కూటమి నాయకులు ముందర ఏకరువు పెట్టారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పర్కిరించాలని కోరుతూ గురువారం కూటమి నాయకులను కోరడంతో కూటమి నాయకుల బృందం ఆ గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను వారి ముందు ఉంచారు. గ్రామం పక్కనే మురుగు కాలువ ఉన్నా గ్రామంలో డ్రెయినేజీ సదుపాయాలు లేక ఎక్కడికక్కడే మురుగునీరు పేరుకుపోతుంది. దీంతో అపారిశుధ్య పరిస్థితులు నెలకొని దోమలు విజృంభించి అంటు రోగాలు భారిన పడుతున్నామన్నారు. తాగడానికి పనికిరాని బోరు నీరు గ్రామానికి సరఫరా చేయడంతో తాగునీరు కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. అండలూరు నుంచి సరఫరా అవుతున్న సిడబ్ల్యుసి నుంచి సరఫరా అవుతున్న తాగునీరు తగినంతగా సరఫరా జరగడం లేదన్నారు. గ్రామానికి వచ్చే ఆర్‌అండ్‌బి రోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డును అభివృద్ధిలో భాగంగా తిరగబెట్టడం జరిగిందని కాని రోడ్డు మాత్రం ఎందుకు వేయడం లేదంటూ నిలదీశారు. గుంతల రోడ్డుతో నానా అవస్థలు పడి గ్రామం నుంచి రాకపోకలు సాగిస్తున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ప్రాథమిక పాఠశాలను ఇక్కడ నుంచి తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కొణితివాడ మాజీ సర్పంచి యరకరాజు చినబాబు మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధికి నోచుకోని రహదారులన్నింటికి సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు ఏర్పాటు అంచనాలు రూపొందించి ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. పాఠశాల ఇక్కడ నుంచి తరలిపోకుండా ఉండాలంటూ అవసరమైనంత విద్యార్థుల సంఖ్య ఉండాలని లేకపోతే ఏమీ చేయలేమన్నారు. గ్రామానికి వచ్చే ఆర్‌అండ్‌బి రహదారి అభివృద్ధికి స్థానిక ఎంఎల్‌ఎ అంజిబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తోలేరు సర్పంచి వేంద్ర లీలావెంకటకృష్ణ, సంజీవరావు పాల్గొన్నారు.

సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నరసాపురం : ఫీజు కట్టలేదనే నెపంతో విద్యార్థులను గదిలో బంధించిన సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తల్లితండ్రులు స్కూల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ విద్యార్థుల జీవితాలతో వ్యాపారం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో ప్రభుత్వ గుర్తింపు ఉండగా సంసిద్ధ్ పేరుతో అక్రమ పద్ధతుల్లో స్కూలు నిర్వహిస్తూ ఇటు తల్లిదండ్రులని, విద్యార్థుల్ని మోసం చేస్తున్నారన్నారు. ఫీజు బకాయిలు ఉన్న విద్యార్థులను ఒక గదిలో బంధించి తల్లిదండ్రులను ఫీజులు చెల్లించాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఫీజు బకాయి ఉన్న విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకుండా, పాఠాలు బోధించకుండా, ఫ్యాన్ కూడా లేని గదిలో నిర్బంధించటం బాలల హక్కులను కాలరాయటమేనన్నారు. ఫీజులు చెల్లించలేని తల్లిదండ్రుల నుంచి ఖాళీ చెక్కులపై సంతకులు చేసి ఇవ్వాలని తల్లిదండ్రులను స్కూల్ ప్రిన్సిపల్ ఒత్తిడి చేస్తూ చెక్కులు తీసుకుంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న సంసిద్ధ్ స్కూల్ గుర్తింపును రద్దుచేసి విద్యార్థుల జీవితాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల విద్యాశాఖ అధికారి పి.పుష్పరాజ్యంకు జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేసి స్కూలుకి వెంటనే రావాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారి హుటాహుటిన స్కూలుకు చేరుకుని స్కూలు యాజమాన్యం చర్యలని తీవ్రంగా ఖండించి స్కూలుపై శాఖాపరమైన చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రాతపూర్వకమైన కంప్లైంట్‌ను తీసుకోవడం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు జి.శ్రీనివాస్, జి.రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.చందు, పి.ధనంజయ, పి.సురేష్, జి.ధీరజ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు పెంచాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

కాళ్ల : కూలీలతో కలిసి పనిచేస్తున్న గోపాలన్

కాళ్ల : గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం వేంపాడు గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి గోపాలన్ వెళ్లి కొంతసేపు వారితో పనిచేసి వాళ్ల కష్టాలు, బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మారడంతో పాటు మరోవైపు ఆక్వా రంగం గణనీయంగా విస్తరించడంతో వ్యవసాయంలో యాంత్రీకరణ పరికరాల రాకతో పేదలకు పనులు తగ్గాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు పెంచి సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భీమవరం టౌన్ : ఉపాధి హామీ పనులు 200 రోజులు చూపించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం తాడేరు గ్రామంలో ఉపాధి పనులను సందర్శించి, కొద్దిసేపు పనిచేసి, కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాడేరులో ఇప్పటి వరకూ ఉపాధి పనులు చూపించలేదని, పనులు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా డబ్బులు పడలేదని ఉపాధి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. పనులు చేస్తున్నా మధ్యలో పేరు రాలేదని పనిలోకి రావద్దని అంటున్నారని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, ఆంజనేయులు మాట్లాడుతూ చిత్తశుద్ధితో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తులు, అనంతలక్ష్మి, సుబ్బలక్ష్మి, సుందరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం : ఉపాధి హామీ కూలీలకు పని ప్రాంతాల్లో ఫొటోలు తీయకుండా ఐదు కిలోమీటర్ల మేర కూలీలను నడిపించటం సరైనది కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కేశవరం గ్రామంలో ఉపాధి కూలీలను కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలను అధికారులు పని ప్రాంతాల్లో ఫొటోలు తీయకుండా జిపిఎస్ ట్యాగ్ పేరుతో నాలుగు నుంచి ఐదు కిలోమీటర్లు నడిపించటం దారుణమని అన్నారు. పనిచేసి అలసిన వారిని ఆన్‌లైన్ మస్టర్ విధానం కూలీలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో జరిగిన ఉపాధి హామీ అవగాహనా సదస్సులో వందరోజులు పనిదినాలు పూర్తిచేసే విధంగా ప్రణాళిక ఉండాలని అధికారులకు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. క్రింద స్థాయిలో పనులు గుర్తించటం, అడిగిన వారందరికీ చూపించకపోవటం, ఒక వారం ఒక గ్రూపుకి పని చూపిస్తే మరలా వేరే గ్రూపు వారికి పని చూపించే స్థితి కిందిస్థాయిలో ఉందనేది గుర్తించాలని అన్నారు. దిద్దే లక్ష్మి, తోట పార్వతి, గేదెలకుమారి, పెచ్చేట్టి ధనలక్ష్మి, పంపన పద్మ, పీతలశ్యాముల్, జరుగుల రాజారావు, తల వెంకటేశ్వరావు, నిల్లాభవరయ్య, పెచ్చెట్టి ఓంకారం పాల్గొన్నారు.



గణపవరం : కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

గ్రామపంచాయతీ కార్యాలయం- లోడిదలంక

కలిదిండి మండలం

ఆర్‌ఓసి.నెంబర్ /2025 టెండర్ నోటీసు తేది.20.3.2025

కలిదిండి మండలం, **లోడిదలంక గ్రామపంచాయతీ** ఏరియాలో ఈ క్రింది తెలిపిన పనులు చేయుటకు కాంట్రాక్ట్ పద్ధతిపై ముగ్గురు వ్యక్తులు ఒక సంవత్సరము **ది.01.04.2025 నుండి 31.03.2026 వరకు** పనులు చేయుటకు లోడిదలంక గ్రామపంచాయతీ కార్యాలయం నందు ది.29.03.2025. తేదిన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషములకు టెండర్ దారుల సమక్షంలో తెరవబడును. మిగిలిన విషయములు కార్యాలయం పని వేళల యందుతెలుసుకొనవలెను.

వ.నెం	టెండర్‌దారుని వివరము	ధరావత్తు
1	స్వీపరు (ఒక వ్యక్తి సేవలు)	రూ.1000 /-
2	ట్యాంక్ వాచర్(ఒక వ్యక్తి సేవలు)	రూ.1000 /-
3	ఎలక్ట్రిషన్(ఒక వ్యక్తి సేవలు)	రూ.1000 /-

నోటీసు :-1. పూర్వము అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2.గ్రామపంచాయతీ నిధులను బట్టి జీతాలు ఇవ్వబడును.
3. టెండర్లు స్వీకరించుటకు తిరస్కరించుటకు పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు.

సం/- బండి సత్యనారాయణ, సర్పంచ్, గ్రామ పంచాయతీ లోడిదలంక కలిదిండి మండలం.
సం/- sk.ఆసిఫ్, కార్యదర్శి గ్రామపంచాయతీ లోడిదలంక కలిదిండి మండలం.

'సంఘం బకాయిల వసూలుకు కృషి చేయాలి'

మొగల్తూరు : మొగల్తూరులోని ప్రాథమిక సహకార సంఘం మహాజనసభ గురువారం నిర్వహించారు. సంఘ ప్రత్యేక అధికారి కె.లక్ష్మీలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువు రైతులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి ఆమె కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి కొత్తపల్లి గోవిందరాజులు ఆర్థిక సంవత్సరంలోని జమ ఖర్చులను చదివి వినిపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను వివరించారు. సంఘం బకాయిలు, వాటి వసూళ్లకు సభ్యులు కృషిచేయాలని లక్ష్మీ లత సిబ్బందికి సూచించారు. రైతులు జి.గాంధీ, చింతపల్లి ఆంజనేయులు, కొల్లాటి మెలాస్వామి, మాగ్రాజు, లోకం కృష్ణమూర్తి, పొన్నపల్లి జనార్దన్ రావు ఉన్నారు.

ఉండమట్లకు జాతీయ పురస్కారం

ఆకివీడు: వీధి బాలల జీవనశైలి ఇతివృతంగా స్థానిక ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఉండమట్ల హనీష్ దర్శకత్వంలో రూపొందిన అక్షరాభ్యాసం లఘు చిత్రానికి జాతీయ పురస్కారం లభించింది. జాతీయ మానవ హక్కుల సంఘం నిర్వహణలో లఘుచిత్ర జాతీయ పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ సి.రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలో జస్టిస్ బిద్యుత్ రంజన్ స్మరన్, విజయ భారతి సాయిని, సెక్రటరీ జనరల్ భరత్ లాల్, డిజిఐఆర్ ప్రసాద్ మీన, రిజిస్టర్ లా జోగిందర్ సింగ్‌తో కూడిన కమిషన్ జ్యూరీ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు గురువారం రాత్రి ఆయన విలేకరులకు తెలిపారు. స్వీయ రచన, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో విద్యకు దూరమవుతున్న బాలల నేపథ్యంలో వీధి బాలల జీవన శైలి వారి స్థితిగతులు ఈ కథనంలో వివరించినట్లు చెప్పారు. వృత్తంతో అక్షరాభ్యాసం లఘుచిత్రంకు 'సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్' జాతీయ పురస్కారం లభించినట్లు చెప్పారు. మానవ హక్కులపై సమాజాన్ని చైతన్య పరుస్తూ జాతీయ మానవ హక్కుల సంఘం 2015 నుంచి లఘుచిత్ర పోటీలను నిర్వహిస్తున్న క్రమంలో 2024 సంవత్సరంలో 303 చిత్రాలలో ఈ చిత్రానికి జాతీయ స్థాయి నాల్గవ స్థానంలో నిలిచిందని చెప్పారు.

నేడు పన్ను వసూలు వేలంపాట

నరసాపురం: పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో వ్యాపారులు కబేళాలో రోజువారీ పన్ను వసూలు చేసుకునే హక్కు కల్పించేందుకు నిర్వహించిన వేలంపాట వాయిదా వేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ ఎం.అంజయ్య ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా ప్రారంభ ధర ఎక్కువగా ఎవరూ పాడేందుకు ముందుకు రాలేదు. దీంతో ఈ నెల 28న శుక్రవారం ఉదయం 11 గంటలకు తిరిగి వేలం పాట నిర్వహిస్తామని ప్రకటించారు.

ప్రకటన

మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి - కమ్ - ఫస్ట్ అడిషనల్ జూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్, పాలకొల్లు
ఐఎ నెం.116/2023 ఇన్ ఓఎస్ నెం.75/2023
బిట్వీన్: బొక్కా ఉషశ్రీ - పిటీషనరు/వాది
వర్సెస్
రావి స్వర్ణసింగ్ వగైరా - రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు,
3వ రెస్పాండెంట్/3వ ప్రతివాది:
రావి మీను మేఘన, తండ్రి: స్వర్ణ సింగ్
రావిపాడు గ్రామం, పోడూరు మండలం, ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్
పై నెంబరు పిటీషను/దావాలో 3వ రెస్పాండెంటు/3వ ప్రతివాదికి ఎన్నిసార్లు కోర్టు నుండి సమన్సు పంపించిననూ సదరు సమన్సు మీరు కావాలనే ఉద్దేశ్యంతో తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్సు జారీ చేయుచున్నారు. కావున మీరు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ ది.8-4-2025వ తేదీ ఉదయం గం.10:30 ని.లకు హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొల్లి సుందర మాణిక్యాల రావు
అడ్వకేట్, నరసాపురం
బొడ్డుపల్లి శ్రీనివాసరావు, అడ్వకేట్, పాలకొల్లు.

ప్రకటన

మా క్లయింటున్నూ, లోగడ పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం పట్టణము, తాళ్ళముదునూరుపాడు, డోర్‌నెం.10-20-11/3ర, చిరునామా కలిగి, వ్యాపారం చేసిన SRI SUVARNA VARSHINI DEVELOPERS (Reg.No.19/2019) అను భాగస్వామ్య వ్యాపార సంస్థను అందలి భాగస్వాములు అనగా (1) మేడపాటి శ్రీనివాసరెడ్డి 2.మేడపాటి వరలక్ష్మి 3.మేడపాటి చక్రధర్‌రెడ్డి 4.మేడపాటి రమ్య అను వార్లు అందరూ కలిసి ది.25-03-2025 సం॥రం తేదిన స్వచ్ఛందంగా రద్దు చేసుకున్నారనిన్నీ, కావున సదరు భాగస్వామ్య వ్యాపార సంస్థ ఆరోజుతో రద్దు కాబడినదనిన్నీ ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.
షేక్ సంధాని భాషా
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
ప.గో.జిల్లా. సెల్: 9390018122

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి దివ్య సముఖమునకు
I.P.No.28/2024
Between:
పెద్దింటి శ్రీనివాస ...పిటీషనరు
మరియు
రెడ్డి సత్యవతి వగైరా ...రెస్పాండెంట్లు
పై నెంబరు పిటీషను న్ను నా క్లయింటు పెద్దింటి శ్రీనివాసు, రెడ్డి సత్యవతి, చిట్టూరి రామలక్ష్మి మరియు అఫీషియల్ రిసీవర్‌లపై ది.6-9-2024వ తేదీన IP.28/24రుగా క్రెడిటర్ పిటీషనున్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషను నందు శ్రీకోర్టు వారు జనరల్ నోటీసు ప్రచురించమని ఉత్తర్వులు జారీ చేయగా కోర్టు వారి ఆదేశానుసారం ఈ జనరల్ నోటీసు ప్రచురించడమైనది. పై నెంబరు IP.28/24 పిటీషను నందు ప్రజానీకానికి ఎటువంటి అభ్యంతరములు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న ఎడల సదరు పిటీషను వాయిదా ది.1-4-2025 తేదీన స్వయముగా కాని, వకీలు ద్వారా కాని ఉదయం 10.30 గం॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియచేసుకోగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
శివంగుల సుబ్బారాయులు
Md.కరీముల్లా ఖాన్
తాడేపల్లిగూడెం. న్యాయవాదులు, తాడేపల్లిగూడెం.
తేది. 26-3-2025 సెల్: 9963285565